ప్రజాశక్తి
మంగళవారం 17 డిసెంబర్ 2024
5
విజయనగరం



పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం 1వ పట్టణ పోలీసుస్టేషన్లో 2020 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు విశాఖపట్టణం జిల్లా పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి చెందిన ఐతి అప్పల నాయుడు (28)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష , రూ.4వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. మెంటాడ మండలానికి చెందిన ఒక బాలిక విజయనగరంలో ఇంటర్ చదువుతున్న సమయంలో ఆటో డ్రైవర్అయిన నిందితుడు ప్పనాయుడుతో పరిచయం ఏర్పడింది. బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి తన ఆటోలో వేరువేరు ప్రాంతాలకు తీసుకువెళ్ళి పలుమార్లు శారీరకంగా అనుభవించినట్లు పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. దీంతో పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి డిఎస్పి పి.వీరాంజనేయ రెడ్డి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 20ఏళ్ల జైలుశిక్ష వేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

తొలగించిన ఆయాను విధుల్లోకి తీసుకోవాలి

- అంగన్వాడీల ఆందోళన
- కలెక్టరేట్ వద్ద బైఠాయింపు
- పీడీపై చర్య తీసుకోవాలని డిమాండ్
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గజపతినగరం మండలం రామన్నపేట అంగన్వాడీ కేంద్రంలో తొలగించిన ఆయా సౌజన్యను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అంగన్‌వాడీలంతా సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు కలెక్టరేట్ మెయిన్‌గేటు వద్ద బైఠాయించిన కార్యకర్తలు ఆయాను విధుల్లోకి తీసుకోవాల, ఐసిడిఎస్ పీడీ, పిఒలపై చర్యలు తీసుకోవాలని నినదించారు. ఆందోళన సమయంలో ఎపిడి వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో రాష్ట్ర చిన్న మధ్య తరహా, సెర్ప్ శాఖా మంత్రి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఇంటికి వెళ్లేందుకు ర్యాలీగా కలెక్టరేట్ నుంచి బయలు దేరారు. జ్యోతి రావ్ పూలే విగ్రహం వద్దకు వెళ్లే సమయంలో డిఎస్పి పోలీసు బందోబస్తుతో వచ్చి ర్యాలీని అడ్డుకున్నారు. మంత్రి తన ఇంటి వద్ద లేరని, కలెక్టర్‌ను, లేదా పీడీని తీసుకొస్తామని చెప్పి నాయకులను ఒప్పించి మంత్రి ఇంటికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో మరల కలెక్టరేట్ ప్రధాన గేటువద్దకు చేరుకున్న అంగన్వాడీలు పీడీ, లేదా కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పి ఆయాకు ఉద్యోగం ఇస్తే తప్ప ఇక్కడనుంచి కదిలేది లేదంటూ ఆందోళన కొనసాగించారు. అంతకు ముందు కలెక్టరేట్ వద్దకు వేలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు చేరుకొని మానపురం సౌజన్య ను విధుల్లోకి తీసుకోవాలనీ డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేసి ముట్టడి కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్ అనసూయ, సిఐ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు టివి రమణ మాట్లాడుతూ అన్యాయంగా అంగన్వాడీ ఆయాను రాజకీయ వేధింపులు కారణంగా తొలగించడం దారుణమన్నారు. అర్హతలన్నీ ఉన్నాయని ఉద్యోగం ఇచ్చిన ఐసిడిఎస్ అధికారులు ఇప్పుడు అర్హతలు లేవని రాజకీయ నాయకులు సిఫార్సులకు లొంగి తొలగించడం సరికాదన్నారు. అంగన్వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే ఇక్కడ నుంచి వెళ్తామని చెప్పి ఆందోళన కొనసాగించారు.



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, యూనియన్ నాయకులు


సిఐటియు నాయకులతో చర్చిస్తున్న డిఎస్పి శ్రీనివాసరావు

జెసితో విచారణ చేసి న్యాయం చేస్తాం : కలెక్టర్

పోలీసుల జోక్యంతో మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో కలెక్టర్ వద్దకు పీడీ శాంతకుమారి సారథ్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు వెళ్లారు. కలెక్టర్ స్పందించి కోర్టులో కేసు నడుస్తున్నందున ఈలోగా జాయింట్ కలెక్టర్ తో విచారణ జరిపించి, ఆయాకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. దీంతో అంగన్వాడీలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.సూర్యనారాయణ, అధిక సంఖ్యలో అంగన్వాడీ లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు

అస్తవ్యస్తంగా గుడ్ల పంపిణీ

- ఆర్‌జెడి విచారణతో బయటపడిన వ్యవహారం
- 4 వారాలకు గాను మూడు సార్లే పంపిణీ
- గత సిడిపిఒ ఆదేశాలతో ప్రతీ వారం వస్తున్నట్లు నమోదు
- పక్క కేంద్రాల నుంచి సర్దుబాటు చేసుకుంటున్న కార్యకర్తలు
- విచారణతో గత నెల చివరి వారం గుడ్ల తిరస్కరణ

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం ఐసిడిఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్ల పంపిణీ అస్తవ్యస్తంగా జరుగుతోంది. నెలకు నాలుగు వారాలు పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం మూడు సార్లు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. వారానికి ఒకసారి ఖచ్చితంగా వస్తున్నట్లు గత సిడిపిఒ ఆదేశాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆర్‌జెడి కార్యాలయానికి ఫిర్యాదు అందడంతో విచారించిన అధికారులు వాస్తవమేనని తేల్చారు. దీంతో గుడ్ల పంపిణీకి సంబంధించిన రికార్డులను ఆర్‌జెడి కార్యాలయం సిబ్బంది తీసుకువెళ్లిపోయారు. దీంతో అప్రమత్తమైన సూపర్‌వైజర్లు గతనెల చివరి వారానికి సంబంధించిన గుడ్లు డిసెంబరులో రావడంతో తీసుకోవద్దని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశించి వారి నుంచి రాత పూర్వకంగా తీసుకొని సిడిపిఒకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో గత సిడిపిఒపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకునే పరిస్థితి ఉందని చర్చ జరుగుతోంది.

భోగాపురం ఐసిడిఎస్ పరిధిలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో 272 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి గుడ్లను ప్రతినెలా వారానికి ఒకసారి చొప్పున నాలుగు వారాలు కేంద్రానికి వెళ్లి సరఫరా చేయాలి. కాని కాంట్రాక్టరు మాత్రం అలా చేయడం లేదు. రెండు వారాలకు ఒకసారి మధ్యలో ఒకసారి చివరి వారం లేదా ఆ వచ్చేనెలలో ఇలా ఇష్టానుసారంగా పంపిణీ చేస్తున్నారు. అంటే నెలకు మూడు సార్లు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్ల కొరత రావడంతో పక్క కేంద్రాల నుంచి సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది

ఫిర్యాదుతో వెలుగు చూసిన వ్యవహారం

ఇటీవలి ఓ వ్యక్తి గుడ్ల వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా గుడ్ల పంపిణీ చేసేటప్పుడు అంగన్‌వాడీ సెంటర్‌కు మొదటి వారం వస్తే పదో తేదీలోపు సంబంధించిన యాప్ ఓపెన్ అవుతుంది. అందులో ఎన్ని గుడ్లు కేంద్రానికి వచ్చాయో అంగన్‌వాడీ కార్యకర్తలు నమోదు చేయాలి. కాని కాంట్రాక్టరు రెండు వారాలకు ఒకసారి ఇచ్చేటప్పుడు కూడా వారానికి ఇస్తున్నట్లే యాప్‌లో నమోదు చేస్తున్నారు. గత సిడిపిఒ ఆదేశాలతో ఇలా చేస్తున్న విషయం ఇటీవలి ఆర్‌జెడి చిన్మయి విచారణకు వచ్చిన సమయంలో బయటపడింది. ఆమెతో పాటు ఆమె కార్యాలయ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిసింది. గుడ్లకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేయడంతో ఈ వ్యవహారం కాస్తా బయటపడింది. దీంతో సంబంధిత రికార్డులను ఆర్‌జెడి కార్యాలయానికి తీసుకువెళ్ళిపోయారు. డిసెంబరు నాలుగో వారానికి సంబంధించిన గుడ్లు ఈ నెల మొదటి వారంలో రావడంతో సూపర్ వైజర్లు అప్రమత్తమయ్యారు. అలా వచ్చిన నాలుగో వారం గుడ్లను తిరస్కరించాలని సూచించారు. ఒక్క భోగాపురం మండలంలోనే సుమారు 40మంది అంగన్‌వాడీ కార్యకర్తలు గుడ్లు తీసుకోలేదు. కాంట్రాక్టరు గుడ్లు వేసినప్పుడు సమయపాలన పాటించడం లేదని అంటున్నారు. గుడ్లు వేసే సిబ్బంది కూడా రోడ్డు మీదే దింపేసి వెళ్ళిపోతున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కూడా వీరు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు లేకపోవడంతో ఖాళీగా ఉన్న ట్రే




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించాలని. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరుతూ ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సుధారాణి మాట్లాడుతూ రోజురోజుకూ ధరలు మండిపోతున్నా విద్యార్థులకు ఇచ్చే మెనూ ఛార్జీలు మాత్రం పెరగడం లేదన్నారు. బిల్లులు నెలల తరబడి చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుత ధరల్లో పిల్లాడికి రూ.20 ఇస్తే తప్ప నాణ్యమైన భోజనం సాధ్యం కాదన్నారు. వెంటనే ప్రభుత్వం బకాయి బిల్లులు గౌరవవేతనాలు తక్షణమే చెల్లించాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రిటైర్మెంట్ బెనిఫిట్ 3 లక్షలు ఇవ్వాలని, 9,10 తరగతుల పిల్లలకు సంఖ్యకు అనుగుణంగా వర్కర్లను పెంచాలని. ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ధర్నా లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చల్లా ఎర్రయమ్మ, పి.దేవి పాల్గొన్నారు.

జానపదాలకు పుట్టినిల్లు.. ఉత్తరాంధ్ర

ప్రజాకవి వరంగల్ శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్ర జిల్లాలు జానపద కళలకు పుట్టినిల్లు అని ప్రముఖ ప్రజాకవి,గాయకులు, సినీగేయ రచయిత, సినీ సంగీత దర్శకులు వరంగల్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక కొండపల్లి గ్రాండ్ హోటల్‌లో 'నూరేండ్ల నా ఊరు' గేయ కావ్యంలో పాడించేందుకు గాయని, గాయకుల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 243 చరణాలతో రచించిన నూరేండ్ల నా వూరు గేయ కావ్యంలో చరణాలను 243 మంది జానపద గాయకులతో పాడించేందుకు ఈ ఎంపికలు కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రానికి చెందిన జానపద కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో ఇప్పటికే ఎంపికలను పూర్తి చేసినప్పటికీ ఉత్తరాంధ్ర యాసప్రాస, జానపదులు అంటే తనకు ఎంతో ఇష్టమని, ఉత్తరాంధ్ర గాయకులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఎంపికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వరంగల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత, గాయకులు, గంద్రేటి శ్రీను, ఎస్‌వి మల్లిక్, తేజ, మహేష్, జూపాక శివ,శివకుమార్, దుర్గాప్రసాద్, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పలువురు గాయనీ గాయకులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ కమిషన్ జిల్లాకు రాక

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్‌సి ఉపకులాల వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సోమవారం సాయంత్రం జిల్లాకు చేరుకుంది. మంగళవారం జిల్లాలో పర్యటించనుంది. ఈ ఏకసభ్య కమిషన్ ఉదయం 11 గంటలకుకలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం అవుతారు. అనంతరం ప్రజలనుంచి వినతులను స్వీకరిస్తారనికలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణ కమిషన్‌ను కలెక్టర్

ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజాన్ మిశ్రా ను జెడ్‌పి అతిథి గృహం వద్ద కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కలిశారు. ముందుగా కమిషన్ కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కమిషన్ రంజన్ మిశ్రాతో సమావేశమై, జిల్లా పరిస్థితిని కలెక్టర్ వివరించారు. డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాస్ మూర్తి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.రామానందం, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి తదితరులు కమిషన్ కలిసిన వారిలో ఉన్నారు.


భూ ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు

- కళ్యాణ మండపంపై నివేదిక ఇవ్వండి
- ప్రజా వినతులపై కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర ప్రభుత్వం తన తండ్రికి కేటాయించిన 40 సెంట్ల భూమిని వేరొకరు ఆక్రమించుకున్నారని, ఆక్రమణలు తొలగించి తన భూమి తనకు దక్కేలా చేయాలని ప్రజావినతుల పరిష్కార వేదికలో అర్జీదారు చేసుకున్న వినతికి జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందించారు. తక్షణం ఈ సమస్యను పరిష్కారం చేయాలంటూ బొబ్బిలి రెవిన్యూ డివిజనల్ అధికారిని ఆన్‌లైన్ ద్వారా ఆదేశించారు. గజపతినగరం మండలం ఎం.వెంకటాపురంలో తన తండ్రి నుంచితనకు సంక్రమించిన 40 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించారని తాడ్డి నానాజీ అనే వ్యక్తి కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై అర్జీదారుని నుంచి పూర్తి సమాచారం తెలుసుకున్న కలెక్టర్ అర్జీదారునికి చెందిన భూమిలో ఆక్రమణలు తొలగించడంతోపాటు గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు కూడా తొలగించాలని చెప్పారు. ఈ సమస్య పరిష్కరించిన వెంటనే తనకు నివేదిక అందించాలన్నారు.

ఎస్.కోట మండలం ధర్మవరంలో ఎంపి ల్యాడ్స్ నిధులతో, ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కళ్యాణమండపాన్ని కొందరు కబ్జా చేశారని కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై విజయనగరం ఆర్‌డిఒతో ఆన్‌లైన్ లో మాట్లాడిన కలెక్టర్ కళ్యాణమండపం వాస్తవ పరిస్థితిపై తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 143 వినతులు అందాయి. ఇందులో రెవిన్యూ శాఖకు సంబంధించిన అంశాలపై 98 ఉన్నాయి. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డి.ఆర్.ఓ. శ్రీనివాసమూర్తి తదితరులు వినతులు స్వీకరించారు. అనంతరం తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాలపై రూపొందించిన కరపత్రాన్ని కలెక్టర్. జెసితో పాటు ఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు ఆవిష్కరించారు.


సమస్యలు వింటున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్


కుమారుడు నవీన్‌కుమార్‌కు టిఫిన్ తినిపిస్తున్న తల్లి

వినతుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే వినతుల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. వినతులు అందజేసిన అర్జీదారులతో అధికారులే నేరుగా ఫోన్‌లో మాట్లాడి వారు అందించిన వినతులు పరిష్కారంపై వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని ఆదేశించారు. సరైన ధ్రువపత్రాలు లేవనే కారణంతో వినతులు తిరస్కరించడానికి వీల్లేదని, అవసరమైన పత్రాలను అర్జీదారు నుంచి తెప్పించుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందే వినతుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ సోమవారం అధికారులతో సమీక్షించారు. ఆర్థికేతర అంశాలపై వచ్చిన వినతులన్నీ పరిష్కారం కావలసిందేనని స్పష్టంచేశారు.

పింఛను మొత్తం పెంచండి

పుట్టినప్పటి నుంచి చేతులు, కాళ్లు చచ్చుబడి మంచంపై ఉన్న తన కుమారుడికి పింఛను పెంచాలని బొబ్బిలి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన చింతాడ నవీన్ కుమార్ తల్లి కలెక్టర్‌ను కోరింది. సోమవారం కలెక్టర్‌కు వినతి అందజేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వస్తున్న రూ.6వేలు మందులకు సైతం చాలడం లేదన్నారు. ఈనేపథ్యంలో పింఛను రూ.15వేలకు పెంచాలని కోరారు. విజయ నగరానికి చెందిన బంగార్రాజు, రజని కూడా తన కుమారుడు బాలాదిత్యకు పింఛను రూ.15వేలకు పెంచాలని కలెక్టర్‌ను కోరారు. పూర్తి అంగవైకల్యం గల తమ కుమారుడిని ఆదుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోలులో అక్రమాలను అరికట్టాలి

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీని, అక్రమాలను అరికట్టాలని కోరుతై ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షులు ఎల్.ఆదినారాయణ అధికారులను కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి అందజేశారు. రైతు సేవా కేంద్రాల్లోనూ ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నట్లు ఆచరణలో జరగడం లేదనారు. ఆర్‌బికెలకు రైతు ధాన్యం ట్రక్ షీట్ జనరేట్ చేసిన వాహనాన్ని కేటాయించిన మిల్లుకు వెళ్ళిన వాహనాన్ని మిల్లర్ వే బ్రిడ్జ్‌పై కాటా వేసి నిబంధనల ప్రకారం వున్న 40 కేజీలకు బదులు 41.5కేజీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వాహనాన్ని నిలిపి వేయడం వల్ల డిమాండ్ మేరకు ఇవ్వాల్సి వస్తోందని తెలిపారు. మొత్తంగా రైతు క్వింటావద్ద రూ.120 నుంచి రూ.150వరకు, ఎకరా వద్ద రూ.3వేలు వరకు మద్దతుధరలో నష్టపోతున్నారని తెలిపారు.



ర్యాలీ చేపడుతున్న మత్స్యకారులు

జీవనాధారం కల్పించండి

'సముద్రమే మా జీవనాధారం.. ఉపాధి కల్పించి ఆదుకోండి' అంటూ పూసపాటిరేగ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారులు సోమవారం కలెక్టరేట్‌కు ర్యాలీనిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా మత్స్యకారులు తమను వేట చేయకుండా అడ్డుకుంటున్నందున వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం గద్దలపాడు గ్రామస్తులు మా బోట్లను అడ్డుకొని మమ్మల్ని కొట్టి జిపిఎస్ పరికరం తీసుకొని సముద్రంలో విసిరేసారన్నారు. మైలపల్లి అప్పన్న, నలుగురు కళాసీలు వేట చేస్తుండగా బందవానిపేట గ్రామస్తులు బోట్లు లాక్కొని కొట్టారని తెలిపారు. వారిపై చర్య తీసుకోవాలని కోరారు. జిల్లా ఫిషరిస్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, ఎం. సింహాచలం, చింతపల్లి సర్పంచ్ ముసలి, మైలపల్లి గాంధీ పాల్గొన్నారు

బకాయి జీతాలు చెల్లించాలని ఆయాల ధర్నా


ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, వాచ్‌మెన్‌లకు 2024 జులై నుంచి ఉన్న బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్‌రావు, బి.సూర్యనారాయణ మాట్లాడుతూ నెలలు తరబడి వేతనాలు బకాయిలు ఉంటే ఎలా పని చేయాలని ప్రశ్నించారు. 300 మంది కంటే తక్కువ మంది విద్యార్థులు ఉన్నారనే కారణంతో తొలగించిన ఆయాలను తిరిగి వీధిల్లోకి తీసుకోవాలని, ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని, ఫుల్ టైం వర్కర్ గా గుర్తించి కనీసం రూ.12వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిక్ లీవులు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలని యూనిఫామ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వై నందిని, టి.స్వాతి, రమణమ్మ, లక్ష్మి ఆయాలు పాల్గొన్నారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

బాధితుల సమస్యలను తక్షణమే చట్టపరిధిలో పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, సమస్యలను వివరించి, చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 38 ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైతే చట్టపరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, డిసిఆర్‌బి సిఐ శంకరరావు, ఎస్‌ఐ రాజేష్ , సిబ్బంది పాల్గొన్నారు.


సమస్యలు వింటున్న ఎస్‌పి వకుల్ జిందాల్

బిల్లులు చెల్లించి ఆదుకోండి

కమిషనర్‌కు కాంట్రాక్టర్ల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థ లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కమిషనర్‌ను కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ కాంట్రాక్టర్లు అసోషియేషన్ నాయకులు, కాంట్రాక్టర్లు కమిషనర్‌ను కలిసి వినతి అందజేశారు. 18 నెలలు నుంచి మేము చేసిన అభివృద్ధి పనులకు డబ్బులు ఇవ్వనందున ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటితో పాటు మంజూరైన 15 వ ఆర్థిక సంఘం తో చేపట్టిన పనులు డబ్బులు కూడా నేటికీ ఇవ్వలేదన్నారు. తక్షణమే స్పందించి మా బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు బంగార్రాజు,అశోక్, శ్రీనివాసరాజు, లింగరావు కాంట్రాక్టర్లు కోరారు.అనంతరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మిని కలిసి వినతి అందజేశారు. కాంట్రాక్టర్లు వాసు,నరేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మిని కలిసిన కాంట్రాక్టర్లు

పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి

నగరంలో పన్ను వసూళ్లను మరింత వేగవంతం చేయాలని కమిషనర్ పల్లి నల్లనయ్య రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ఈ మేరకు ఈరోజు అన్ని సచివాలయాల పరిధిలో పన్ను బకాయిదారుల వద్దకు వెళ్లి పన్ను వసూళ్ల ప్రక్రియను సిబ్బంది చేపడుతున్నారు. దీర్ఘకాల బకాయిలు ఉన్నవారి కి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. అప్పటికి స్పందించకపోతే కుళాయి కనెక్షన్లను తొలగించి వేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి, కులాయి, ఖాళీ స్థలాల పన్ను వసూలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు.

వినతులు పరిష్కారానికి కషి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి 2 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ఇఇ టి.రాయల్ బాబు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఉమ

జాతీయ స్థాయి పోటీలకు కెజిబివి విద్యార్థినులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల
జాతీయ స్థాయి టెన్నిస్ వాలీబాల్ పోటీలకు కెజిబివి విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.ఉమ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కెజిబివిలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయి టెన్నిస్, వాలీబాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సిహెచ్ హారిక, వై.యామిని, సీనియర్ ఇంటర్ విద్యార్థి ఎం. దాక్షాయిని ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి 9వ అంతర్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు ప్రిన్సిపాల్ ఉమాతో పాటు ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఘనంగా ఇంధన పొదుపు వారోత్సవాలు

నెల్లిమర్ల: విద్యుత్ ఇందన పొదుపు వారోత్సవాలు సోమవారం స్థానిక మొయిద జంక్షన్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందనం పొదుపుపై ర్యాలీ నిర్వహించి బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. అనంతరం సబ్ స్టేషన్ ఎఇ పిచ్చయ్య మాట్లాడుతూ ఇందనం పొదుపు పాటించి భవిష్యత్తు తరాలకు విద్యుత్ కొరత లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా వినియోగదార్లు తక్కువ విద్యుత్ ఖర్చయ్యే పరికరాలు వాడాలని ఆయన కోరారు.

బహుళ పంటలతో అధిక ఆదాయం

కొత్తవలస: బహుళ పంటలతో అధిక ఆదాయం సంపాదించవచ్చునని ప్రకృతి వ్యవసాయం రీజినల్ టీం తిమాటిక్ లీడ్ ప్రకాష్, రీజినల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. మండలంలోని గొల్లలపాలెంలో రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా వేసిన కాయగూరల్లో బహులు పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ పంటల్లో రైతులందరూ బహుళ పంటలు వేయాలని పిలుపునిచ్చారు. రైతులు బహుళ పంటలు వేయడం వల్ల అధిక ఆదాయంతో పాటు పంటకు ఆశించే చీడపీడలను కూడా నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌టి కోటిబాబు, సిబ్బంది శ్యామల, ఉష, శ్రావ్య, దేముడమ్మ, గ్రామస్థాయి కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెంకటనాయుడుకు ఎమ్మెల్సీ పరామర్శ

వంగర: మండలంలోని శివ్వాం గ్రామానికి చెందిన ఏనుగుతల వేమి నాయుడు (83) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆయన కుమారుడు వైసిపి నాయకులు ఏనుగుతల వెంకట నాయుడుని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శివ్వాం గ్రామానికి వెళ్లి సోమవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వంగర, వీరఘట్టం ఎంపిపిలు ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, ధమలపటి వెంకటరమణ, వైసిపి వంగర మండల సీనియర్ నాయకులు కరణం సుదర్శన రావు, బొత్సల సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శృంగవరపు కోట: పట్టణ కేంద్రంలో గల రావంగార్ కాలనీలో సోమవారం రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ సహా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి వివరించారు. గ్రామంలో మరికొన్ని సమస్యలను ప్రజలు ప్రస్తావించగా వాటిపై కూడా ఆమె ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, వాకాడ బాలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జూదగాళ్లకు సామాజిక సేవా శిక్ష

నెల్లిమర్ల: జూదగాళ్లకు ఎక్సైజ్ కోర్ట్ సామాజిక శిక్ష విధించినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అక్టోబర్ 6న పూడమ్మ తల్లి గుడి పరిసర ప్రాంతాల్లో జూదం ఆడుతూ పట్టుబడిన ఏడుగురుని పట్టుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పర్చగా ఎక్సయిజ్ మేజిస్ట్రేట్ వారికి ఐదు రోజులు సామాజిక సేవా శిక్షను విధించినట్లు తెలిపారు. శిక్ష అమలులో భాగంగా వీరు ఐదు రోజులు నెల్లిమర్ల పట్టణంలో గల వివిధ స్కూళ్లు, కాలేజీల్లో శ్రమదానం చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్‌మేళా

రాజాం: పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపల్ బి.భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాకు 20-50 హెల్త్ కేర్, హెట్రోరో డ్రగ్ బహుళ జాతి కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు గాను అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించి, 18-35 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులని చెప్పారు. ఈ మేళాలో పాల్గొనే అభ్యర్థులు http://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డుతో పాటు రెస్యూమ్, ఆధారకార్డ్, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

22న శ్రీసాయి డిగ్రీ కళాశాలలో..

బొబ్బిలి: స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఈనెల 22న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ లేబొరేటరీస్‌లో ఉద్యోగాలు కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బిఎస్సి కెమిస్ట్రీ, బిఫార్మసీ, బిటెక్ కెమికల్, ఎంఫార్మసీ, ఎమ్మెస్సి ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఏనాలిటికల్ కెమిస్ట్రీ పూర్తి చేసి 21 నుంచి 25 ఏళ్ల లోపు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు 9440921855, 9491796996, 9985742636, 9966861821 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సిసి పుటేజీ ఆధారంగా బ్యాగ్ గుర్తింపు

రాజాం: పట్టణ పరిధిలో గల అమ్మవారి కాలనీకి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ అర్నిపల్లి వెంకటనాయుడు 13 తేదీన పోలిపల్లి అమ్మవారి దేవాలయం దగ్గర కుటుంబంతో కలిసి ఆటోలో బ్యాగ్ పెట్టి మర్చిపోయి, ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర ఆటో దిగి క్యాంపునకు వెళ్లిపోయారు. బ్యాగ్‌లో రూ.32 వేలు నగదు, ఇంపార్టెంట్ పత్రాలు ఉన్నాయని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం రాజాం టౌన్ సీఐ, పోలీసులు సీసీటీవీ ఆధారంగా బ్యాగ్ కనిపెట్టి వారికి సోమవారం అప్పగించారు. ముఖ్యమైన సెంటర్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించవచ్చునని సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన కాకర్లపూడి

భోగాపురం: వ్యక్తా వ్యక్తం పుస్తకాన్ని జనసేన నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు సోమవారం ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ఉమా మహేష్ ఆచాళ్ళ అనే రచయిత రచించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇలాంటి పుస్తకాలు వ్రాయడం గొప్ప విషయమని అన్నారు. పెద్దలకు, చిన్నారులకు, సమాజానికి ఉపయోగపడే పుస్తకాలు మరిన్ని రాయాలని రచయిత ఉమా మహేష్‌ను కోరారు. భోగాపురంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణరాజు, సోమేశ్వరరావు, శివకుమార్, రఘు, తిరుపతిరావు, కిషోర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం కోట : వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో రాష్ట్రీయ బాల స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా ఖాళీగా ఉన్న దంత వైద్యులు, క్లినికల్ సైకాలజిస్ట్, ఆడియజిస్టు, స్పీచ్ థెరపిస్ట్ , ఇన్ క్లూజువ్ ఎడ్యుకేషనిస్టు, డెంటల్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్, పోస్టులకు దరఖాస్తులు అర్హులైన అభ్యర్థుల నుండి కోరుతున్నట్లు తెలిపారు. వీటికి సంబంధించి దరఖాస్తు ఫారం ఇతర సమాచారం కోసం vizianagaram.nic.in వెబ్‌సైట్‌ను దర్శించాలని కోరారు.

13 మద్యం బాటిళ్లు స్వాధీనం

గజపతినగరం: ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ సిఐ ఇందిరాదేవి ఆధ్వర్యాన ఎస్ఐ రాజశ్రీ, సిబ్బంది మరుపల్లి గ్రామంలో దాడి చేసి 13 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు దేవర రామును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. దాడిలో హెచ్‌సి నాగేశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు

రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిందేనా?

ప్రజాశక్తి-చీపురుపల్లి
ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న తమ జిరాయితీ భూములు గత ప్రభుత్వం జరిపిన సర్వేల కారణంగా వందలాది ఎకరాలు నిషేధిత భూముల జాబితా (22ఎ)లోకి మారిపోవడంతో గత్యంతరం లేక తాము ఆత్మహత్యలు చేసుకోవలసిన దుస్థితి ఏర్పడిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబురావు అన్నారు. సోమవారం మండలంలోని పేరిపి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. పేరుపి రెవెన్యూ పరిధిలో తన పేరుతో ఉన్న జిరాయితీ సాగు భూమిని సైతం గత ప్రభుత్వంలో అధికారులు పైరవీలకు తలొగ్గి నిషేధిత భూముల జాబితాలో పెట్టడం దురదృష్టకరమన్నారు. పేరిపి రెవెన్యూ పరిధిలో సుమారు 350 ఎకరాలు భూమిని సాగు చేసుకుంటున్న రైతుల జిరాయితీ భూములు మొత్తం నిషేధిత జాబితాలో చేర్చారని చాలా మంది తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆందోళన చెందుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ తమ భూములను సర్వే జరిపి జిరాయితీ భూములుగా మార్చాలంటూ రైతుల తరపున తహశీల్దార్ ఎన్.రాజారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘ అధ్యక్షులు ఎలకల అప్పారావు నాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి శ్రీనివాసరావు, సబ్ రిజిస్టర్ పివికెఎస్ లక్ష్మణరావు, మండల నోడల్ అధికారి హేమసుందర్‌రావు, ఆర్ఐ డి రామ్‌కుమార్, స్థానిక టిడిపి నాయకులు మోపాడ తేజేశ్వరరావు, పాల్గొన్నారు.



వేపాడ: వావిలపాడులో ర్యాలీ చేస్తున్న సర్పంచ్, సిబ్బంది

వావిలిపాడు రెవెన్యూ సదస్సుకు స్పందన

వేపాడ: మండలంలోని వావిలిపాడు సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పందన లభించింది. ఇందులో భాగంగా ముందు గ్రామంలో సర్పంచ్ బీల రాజేశ్వరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో వావిలపాడు, చామలాదేవి అగ్రహారం రైతులు వద్ద నుంచి 12 దరఖాస్తుల స్వీకరించారు. ఈ సదస్సులో ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, తహశీల్దార్ జె. రాములమ్మ, ఎంఆర్ఐ రామలక్ష్మి, గ్రామ రెవెన్యూ అధికారి సన్యాసిరావు, మండల సర్వేయర్, గ్రామ పెద్దబీల సతీష్ రైతులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని అలుగోలులో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి.సుదర్శనరావు మాట్లాడుతూ భూ సమస్యలుంటే సదస్సులో పరిష్కరించుకోవచ్చన్నారు. అంతకముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించి సదస్సుల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో పలువురు నాయకులు, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురం: మండల పరిధిలోని కొట్టక్కి రెవెన్యూ సర్వే నెంబరు 537లో భూఆక్రమణకు పాల్పడిన టి.నాగరాజు, వారి కుటుంబీకులపై చర్యలు తీసుకొని ఆ భూమిని స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. కొట్టక్కి గ్రామంలో సోమవారం తహశీల్దార్ సులోచనారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ సుమారు 30 ఎకరాల డిపట్టా భూమిని బినామి పేర్లుతో కబ్జా చేశారని ఆరోపించారు. కొట్టక్కి గ్రామంలో ఎస్‌సి కుటుంబాలకు శాశ్వత శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన బుల్లయ్య, పోలయ్య, రాజు, శంకరరావు తదితరులు కోరారు.

విజయనగరంకోట: సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దార్ కూర్మనాథం తెలిపారు. సోమవారం గుంకలాం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రజలు భూ సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సదస్సులో మొత్తం 17 వినతులు రాగా, అందులో 12 మ్యుటేషన్, ఒకటి ఆధార్ కరెక్షన్, ఒకటి అడంగల్ కరెక్షన్, ఒకటి లేట్ డెత్ వినతులు వచ్చాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కునుకు వెంకట్రావు, మండల సర్వే అప్పలనాయుడు, ఎంపిటిసి నారాయణరావు, టిడిపి నాయకులు అప్పలస్వామి, నాగరాజు, విఆర్ఒ భరత్ కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో మాజీ ఎమ్మెల్యే గద్దె


చీపురపల్లి: తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న గద్దె


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పార్టీలకతీతంగా అభివృద్ధి

పూసపాటిరేగ: పార్టీలకతీతంగా గ్రామాలాభివృద్ధిపై దృష్టి పెడతామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సోమవారం మండలంలోని పతివాడ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరం కలసి అబివృద్ధికి సహకరించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా బలోపేతం అవ్వాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. స్వయం ఉపాధిపై దృష్టిపెట్టేలా కృషి చేస్తున్నామన్నారు. 2026 కల్లా రామతీర్థసాగర్ పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తి అయితే మన ప్రాంతానికి సాగునీరు, తాగునీటి సమస్య తీరుతొందన్నారు. జెడ్‌పి, మండల పరిషత్ నుంచి నిధులు ఇవ్వాలని కోరారు. ఎవరైనా తన పేరుపై లంచం అడిగితే వెంటనే తనకు చెప్పాలన్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు మాట్లాడుతూ సచివాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగం అన్నారు. ఉద్యోగులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు, సర్పంచ్ ఆకుల పైడిరామ, నాయకులు పతివాడ అప్పలనాయుడు, మహంతి జనార్ధనరావు, పతివాడ శ్రీను, బాలా అప్పలరాజు, శంకాబత్తుల సత్తిబాబు, మహంతి శివ, జలపారి శివ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర గ్రామాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - డెంకాడ
సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, సచివాల సిబ్బందికి రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ప్రతి ఒక్క లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన ప్రణాళికలు ప్రతి గ్రామపంచాయతీలో రూపొందించుకోవాలన్నారు. శిక్షణకు ఈటిసి సామర్లకోట నుంచి వచ్చిన పద్మజ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై.భవాని, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, వెలుగు ఎపిఎం శ్రీనివాసరావు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం సుస్థిర గ్రామాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంఠ రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ వనరులు సద్వినియోగంపై వివరించారు. గ్రామస్థాయిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది చేపట్ట వలసిన పలు ముఖ్యమైన అంశాలను వివరించారు. ప్రధానంగా పేదరిక నిర్మూలన, గుడ్ హెల్త్, క్లారిటీ విద్య, పరిశుభ్రమైన నీరు, గ్రీన్ ఎనర్జీ, గ్రామస్థాయిలో ప్రజలకు శాంతి, న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని అప్పుడే గ్రామ స్వరాజ్యం గ్రామాలాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా కోఆర్డినేటర్ విజయ్, మండల స్థాయి అధికారులు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


డెంకాడ: మాట్లాడుతున్న ఎంపిపి వెంకట్ వాసుదేవరావు

రేగిడి: సుస్థిరమైన గ్రామాలు ఏర్పాటుకు భాగస్వామ్యంతోనే లక్ష్యాలు పూర్తి చేయవచ్చని ఎంపిడిఒ శ్యామల కుమారి, ఇఒపిఆర్‌డి ఎవి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానికి ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయం ఉద్యోగులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ చట్టం ఆర్టికల్ 73, 74 ప్రకారం గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రజలను భాగస్వామి చేయాలని వెల్లడించారు. మంచి సమాజం ఏర్పాటు కావాలంటే మంచి ప్రణాళికలతో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ రూరల్ డెవలప్ మెంట్ పై దృశ్య శ్రవణంలో 29 శాఖలకు సంబంధించి అంశాలను ఇఒపిఆర్‌డి అవగాహన కల్పించారు.

భోగాపురం: గ్రామాలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పై వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని అన్నారు. సామర్లకోట శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన అధికారిని పద్మజ వీరందరికీ గ్రామ పంచాయతీల అభివృద్ధిపై వివిధ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె. కిషోర్‌కుమార్, ఇఒపిఆర్‌డి కె.గాయత్రి, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ అధ్యక్షతన సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు బ్యాచ్‌లుగా విడగొట్టి రెండు రోజులు పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అబ్జర్వర్ ప్రసాదరావు, జిల్లా డిటిఎమ్ ఎస్ లోకనాథ్, సర్పంచులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రూ.160 కోట్ల స్త్రీనిధి రుణాల పంపిణీ లక్ష్యం

రామభద్రపురం: 2024-25 ఆర్థిక సంవత్సరానికి స్త్రీనిధి పథకం కింద జిల్లాలో రూ.160 కోట్లు రుణాల పంపిణీయే ప్రధాన లక్ష్యమని స్త్రీనిధి జిల్లా మేనేజర్ కే.రమేష్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.131.4 కోట్లను 16,937 మంది మహిళలకు రుణాలుగా అందించామన్నారు. మిగతా లక్ష్యాన్ని వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రికవరీ శాతం 98 శాతం పైబడి ఉందన్నారు. మహిళల జీవనోపాధి మెరుగుపరచడానికి స్త్రీనిధి పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు పెంపకం చేపట్టి మహిళలు ఉపాధి అవకాశాలు మెరుగు పరచుకుంటున్నారన్నారు. రామభద్రపురం, దత్తిరాజేరు, మెంటాడ, గజపతి నగరం, బొబ్బిలి, బాడంగి క్లస్టర్ పరిధిలో ఉన్న మండలాల్లో స్త్రీనిధి పథకం కింద 5,600 మంది డ్వాక్రా మహిళలకు రూ.32.75 కోట్లు రుణాలు అందించామని తెలిపారు. స్త్రీనిధి పథకంలో భాగస్వాములైన మహిళలకు సురక్ష ద్వారా బీమా సౌకర్యం కల్పించామన్నారు. రెండు సంవత్సరాల కాలపరిమితిలో రుణం తీసుకున్న మహిళ మరణిస్తే అప్పటికున్న మొత్తాన్ని మాఫీ చేస్తామన్నారు. వెలుగు ఎపిఎం కోట్ల అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఓడిపోతామని ఆపేశారా?

నీటి సంఘాల ఎన్నికల్లో అధికారులపై టిడిపి నాయకుల ఒత్తిడి

ప్రజాశక్తి - జామి
'ప్రజాస్వామ్యం కూనీ అవుతోంది. నిరంకుశ పాలన నడుస్తోంది. రాష్ట్రానికి ఇదేం ఖర్మ అని నిన్నటి వరకు గగ్గోలు పెట్టిన టిడిపి నాయకులు అధికార పీఠం మెక్కి, నిసిగ్గుగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. తాజాగా జరిగిన నీటి సంఘం ఎన్నికల్లో టిడిపి పెద్దలు చేసిన పెత్తనం అంతా ఇంతా కాదు. టిడిపి మద్దతు దారుల బలం లేని చోట కూడా, ఓడిపోతాం కాబట్టి ఎన్నికలు ఆపేయండంటూ హుకుం జారీ చేయడాన్ని ఏం ప్రజాస్వామ్యమో అంటూ జనం ముక్కున వేలేసుకుంటున్న పరిస్థితి.

మండలంలో 14 మైనర్, 4 మీడియం నీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. అన్ని చోట్ల ఎన్నికల సిబ్బందిని నియమించారు. కానీ ఇక్కడే అసలు మెలిక. ఎక్కడా వైసిపి మద్దతు దారులు గెలవకూడదని స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. చింతాడ గ్రామంలో ఎస్.కోట - తలారీ ఆయకట్టు సిస్టమ్ కింద 350 మంది వరకు ఆయకట్టు రైతులకు గుర్తింపు ఉంది. ఎన్నిక సమయానికి సుమారుగా 300 మంది వైసిపి మద్దతు దారులు చేరుకుని ఎన్నిక నిర్వహించాలని కోరారు. కానీ టిడిపి నాయకులకు బలం లేదని తెలుసుకొని కొంటి షాకులతో ఎన్నికల అధికారులు అక్కడ నుంచి పలాయాణం చిత్త గించారు. చివరికి రైతులు సిబ్బందిని అడ్డుకుని ఘోరావ్ చేసినా పోలీసుల సాయంతో పారిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జామి, కలగాడ, శాసనాపల్లిలో కూడా అదే జరిగింది. ఎన్నికలు లేకుండానే టిడిపి పెద్దలు ఇచ్చిన పేర్లు రాసేసుకుంటున్న వైనం జిల్లా అంతా బయటపడింది. నిన్నకాక మొన్న పాఠశాల తల్లిదండ్రుల కమిటీల ఎన్నికల్లోనూ టిడిపి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసిన విషయం తెలిసిందే. ఒక్క ఎన్నికల్లోనే కాదు.. ఎక్కడైతే వైసిపి బలంగా కనిపిస్తోందో.. అక్కడ నాయకులపై పోలీసులను ప్రయోగించి, కేసులు పెట్టించడం, ప్రతిపక్ష నాయకులు, టిడిపి వ్యతిరేకుల ఆర్థిక మూలాలు దెబ్బతీసే చర్యలకు ఆయా ఎమ్మెల్యేలు బాహాటంగానే తెగబడుతున్న ఉదాంతాలు కోకొల్లలు. ఇప్పటికైనా టిడిపి తీరు మార్చుకుని ప్రజాస్వామ్య బద్దంగా వ్యవహరించకుంటే, వైసిపికి పట్టిన గతే పడుతుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.


రైతులను నిలువరిస్తున్న కానిస్టేబుల్(ఫైల్)

విద్యారంగ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి- బొబ్బిలి
తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యా రంగ పరిరక్షణకు, అధ్యాపక, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజ యగౌరి అన్నారు. స్థానిక తాండ్ర పాపారాయ మున్సిపల్ పాఠశాలలో సోమవారం ఎన్నికల కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా రంగంలో ఎదుర్కొం టున్న సమస్యలపై నికరంగా, నిరంతరంగా కృషి చేసే అవకాశం తనకు ఇవ్వాలన్నారు. అన్ని స్థాయిల్లో పదోన్నతుల విషయంలో అడ్‌హాక్ పద్ధతిలోనే ప్రమోషన్ ఛానల్‌లో ఓపెన్ చేయాలని ప్రత్యామ్నాయం కోసం కృషి చేస్తామ న్నారు. 117 జిఒ, సిపిస్ రద్దు వంటి దీర్ఘకాలిక అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, కెజిబివి, మోడల్ స్కూల్స్, జ్యోతిరావు పూలే పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలపై, మినుమం టైం స్కేలు సాధన కై కృషి చేస్తానని, కాంట్రాక్టు లెక్చరర్లకు 114 జిఒ అమలకు కృషి చేస్తామని చెప్పారు. విద్యారంగంపై సమగ్రమైన అవగాహన ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్న కుమార్, సత్యన్నారాయణ, అనె శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, సుధాకర్, అప్పలనాయుడు, మహేష్, అనంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - తెర్లాం
మండలంలోని నెమలాం, సుందరాడ సచివాలయాల పరిధిలో గల గ్రామాల్లో సోమవారం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 100 రోజుల క్షయ వ్యాధి నిర్మూలన పట్ల అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించారు. ప్రతిరోజు ప్రతి సచివాలయ పరిధిలో ఈ అవగాహన సదస్సులు గ్రామస్థాయిలో ఆశ, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, హెల్త్ సూపర్వైజర్లు, టిబి సూపర్వైజర్లు, వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించి క్షయ వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలుపై అవగాహన కల్పించనున్నారని వైద్యులు వెంకటేష్, మనోజ్ఞ తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

బొండపల్లి: మండలంలోని ముద్దూరు, తమటాడ గ్రామాలలో టీబీ వ్యాధి నిర్మూలనపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 100 రోజుల టిబి వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ నోడల్ ఆఫీసర్ ఎస్ఏ భాషా మాట్లాడుతూ టీబీ వ్యాధిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని కోరారు. ప్రమాదకర స్థితిలో ఉన్న మధుమేహ వ్యాధి గ్రస్తులు, గతంలో టిబి వ్యాధి వచ్చిన వారు, వారి కుటుంబ సభ్యులు, పొగ తాగేవారు, 60 సంవత్సరాలు దాటిన వారు, పోషకాహార లోపంతో వున్న వారు, హెచ్‌ఐవి పేషెంట్‌లందరికీ ఈ 100 రోజులలో కఫం పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్దురు సర్పంచ్ మునకాల పైడపునాయుడు, మాజీ సర్పంచ్ కళ్యాణపు నారాయణరావు, తమటాడ గ్రామ టిడిపి మహిళా నాయకులు రాధ, ఎంఎల్‌హెచ్‌పి సంధ్య, ఎఎన్ఎం పైడితల్లి, ఆశా కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన కార్యక్రమాలు

విజయనగరం టౌన్: గాజులరేగలోని 59వ సచివాలయంలో ఆరోగ్య కార్యదర్శులు, ఎఎన్ఎంలు సంయుక్తంగా క్షయ వ్యాధి నివారణ పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి వ్యాధి ముఖ్య లక్షణాలు, వాటిని నివారించే చర్యలు గురించి వివరించారు. క్రమం తప్పకుండా వైద్యం అందించినట్లయితే క్షయ వ్యాధి ప్రాణాంతకం నుండి బయటపడవచ్చునని తెలిపారు. వారం రోజుల కన్నా ఎక్కువగా దగ్గినట్లయితే క్షయ పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచించారు.

రుణమాఫీ చేసినట్లు ఎన్‌ఒసి ఇవ్వాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట
జగన్ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన హౌసింగ్ రుణాలు మాఫీ చేసినట్లు ఎన్‌ఒసిలు ఇవ్వాలని జనసేన నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసి నాయుడు కోరారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులతో కలిసి ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం పట్టాలు పైన రూ.1.80లక్షలు ఇంటి నిర్మాణం నిమిత్తం కేటాయించగా వడ్డీలేని రుణం రూ.35, ఇసుక నిమిత్తం రూ.15వేలు మెటీరియల్ నిమిత్తం రూ.40వేలు వెరసి మొత్తం రూ. 2.70లక్షలు లబ్ధిదారునికి ముట్టినట్టు తప్పుడు ప్రకటన పట్టాపై ముద్రించి ఇచ్చారని హౌసింగ్ లోన్ కోసం బ్యాంకులకు వెళ్ళగా, సదరు బ్యాంక్ రూ.35వేలు పట్టామీద లోన్ ఇచ్చినట్టు ముద్రించారని ఆ లోన్ క్లోజ్ చేస్తూ ఎన్‌ఒసి ఇవ్వాలని లేదా లోన్ ఇవ్వలేదనీ ధృవీకరణ పత్రం తెచ్చుకుంటే హౌసింగ్ లోన్ మంజూరు చేస్తామని బ్యాంక్ వారు చెబుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు ఎన్‌ఒసి ఇప్పించాలని కోరారు. కాలనీ వాసులకు ఇంకుడుగుంతలకు, మరుగుదొడ్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. హౌసింగ్, ఉపాధిహామీ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని ఎంపిడిఒ సతీష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు తాండ్రంగి చంటి, టౌన్ పార్టీ అధ్యక్షులు మోపాడ చిన్ని, మళ్ల వలస నాని, కాలనీ వాసులు కృష్ణ, చిప్పాడ ఈశ్వరమ్మ, అశోక్, కుమార్, కళావతి, కనకమ్మ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.


ఎంపిడిఒకు వినతినిస్తున్న బాధితులు, జనసేన నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి- మెంటాడ
కూనేరు పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం ఎగువమిర్తి వలస గిరిజనులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం నాయకులు రాకోటి రాములు కోరారు. సోమవారం ఎంపిడిఒకు ఆయన గిరిజనులతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. రాములు మాట్లాడుతూ గ్రామానికి తాగునీరు, రహదారి లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటికి సుదూర ప్రాంతాలకు వెళ్లి ఊటనీరు తెచ్చి వంటలకు తాగటానికి ఉపయోగించుకొని కాలం వెళ్లబుచ్చుతున్నారని చెప్పారు. ఊట నీరు తాగడం వల్ల రోగాలకు గురవుతున్నారని, రోగాల బారిన పడి నయం చేసుకోవడం కోసం ఆసుపత్రులకు రావాలన్నా సరైన రహదారి లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోయిరి అప్పలస్వామి, సారా అడవి రాజు, పోయిరి లచ్చయ్య గిరిజనులు పాల్గొన్నారు.

సొంత భవనం నిర్మించకుంటే ప్రజాపోరాటం

కలెక్టరేట్ వద్ద ధర్నాలో రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
జిల్లా కేంద్రంలో డిగ్రీ కాలేజికి సొంత భవనం నిర్మించాలని కోరుతూ సోమవారం విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నాచేసారు. ఈ సందర్భంగా ఆ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ సొంత భవనం నిర్మించే వరకు తాత్కాలికంగా పద్మావతి నగర్ 3వ రోడ్ లో ఉన్న ఖాళీగా ఉన్న హాస్టల్ భవన్‌లో కి డిగ్రీ కాలేజీని మార్చాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు విద్యల నగరంగా పేరొందిన విజయనగరంలో నేడు మహిళా కాళాశాల, బిఇడి, లా కళాశాలలు ఎత్తేసారన్నారు. ఫలితంగా నేడు విద్యా హీనంగా మారుతుందన్నారు. శిల్పారామం వద్ద 20 ఎకరాల్లో డిగ్రీ కాలేజికి కేటాయించాలన్నారు. విజయనగ రంలో విద్యాభివృద్ధికి విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించేవరకు ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.రామచంద్రరావు, నగర కార్యదర్శి రంభ శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు